క్లుప్తంగా

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎతికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైప్రో టెక్నాలజీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ డివైజెస్‌లో డేటాను ఎలా భద్రపర్చుకోవాలి, హ్యాక్స్ అవకుండా ఎలా కాపాడుకోవాలి, నెట్ వర్కింగ్, ఇన్ఫర్మేషన్ గేదరింగ్ టూల్స్ (విండోస్, లైనెక్స్)లపై అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ అనలిస్ట్ కె.రాజేష్, జి.మహేష్, కె.తరుణ్, బ్రహ్మేంద్ర సైప్రో టెక్నాలజీ నుంచి వర్క్‌షాప్ నిర్వహించారు. హెచ్ఓడీ జి.శేషుకుమార్ పాల్గొన్నారు.

కూచిపూడి విద్యార్థులకు అభినందనలు



వీసీ ఆచార్య పద్మరాజును కలిసిన కూచిపూడి విద్యార్థులు

రాజానగరం: తిరుమలలోని శ్రీనివాసుని సాలకట్ల బ్రహ్మోత్సవాలలో పాల్గొని, నృత్య ప్రదర్శనలు ఇచ్చిన కూచిపూడి డిప్లమో విద్యార్థులను ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందించారు. కూచిపూడి డిప్లమో కోర్సు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకురాలు గురువారం ఆయనను కలుసుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో మహిషాశురమర్దని, నారాయణ స్తోత్రం వంటి కీర్తనలకు అనుగుణం చక్కటి నృత్య ప్రదర్శనలిచ్చి, అందరి ప్రశంసలు అందుకున్నట్టు వీసీకి తెలిపారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన బస్సు



బిక్కవోలులో ప్రమాదానికి గురైన బస్సు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు–గొల్లల మామిడాడ రోడ్డులో సూరంపాలేనికి చెందిన ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సు గురువారం అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఘటన జరిగినపుడు బస్సులో విద్యార్థులున్నా అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రంగాపురం గ్రామానికి చెందిన తుట్టా అప్పల నరసమ్మ అనే వృద్ధురాలు కిరాణా షాపు నిర్వహిస్తుంది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఒక వ్యక్తి వృద్ధురాలిని సిగరెట్ ఉందా అని అడిగారు. ఆమె లేదని బదులిస్తుండగా మరో వ్యక్తి ఆమె మెడలో మూడు కాసుల బంగారు తాడు లాక్కుని ఇద్దరూ బైక్‌పై పారిపోయారు. ఆమె ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

అత్తను గాయపరిచిన అల్లుడు

బిక్కవోలు: అత్తను గాయపరిచిన అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం బిక్కవోలుకు చెందిన సీహెచ్ లోవరాజు, నామవరానికి చెందిన దేవిలకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల లోవరాజు తన భార్య దేవిను కొట్టాడు. ఈ నెల 4వ తేదీన ఆమె తల్లి అనసూయ వచ్చి తన కుమార్తెను ఎందుకు కొడుతున్నావంటూ అల్లుడిని ప్రశ్నించింది. దీంతో లోవరాజు కర్రతో ఆమె తలపై కొట్టాడు. అనసూయకు రక్తపు గాయాలవ్వడంతో అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

అనపర్తి ఎస్ఐగా జగన్‌మోహన్‌రావు



అనపర్తి: అనపర్తి పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్ఐ)గా బి.జగన్‌మోహన్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి ఆయన బదిలీపై అనపర్తి వచ్చారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జగన్‌మోహన్‌రావుకు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఖర్చు మితం.. పోషణ అమితం

- చిరుధాన్యాలతో పౌష్టికాహారం
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు
- చురుగ్గా అవగాహన కార్యక్రమాలు



చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలు



కోరుకొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శన

మధురపూడి: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి, రోగాలకు దూరంగా ఉండవచ్చు. సాధారణంగా ఖరీదైన పదార్థాల్లోనే పోషక విలువలు ఉంటాయని చాలామంది అనుకుంటారు. వాటిని కొనలేక ఇబ్బంది పడతారు. అయితే మన ఇంట్లోని పదార్థాలతోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో విటమిన్లు అధికంగా ఉంటే పదార్థాలు తినవచ్చు. వీటిపై ప్రజలకు చైతన్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా చిరుధాన్యాలతో వివిధ పదార్థాలను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తెలిజేస్తున్నారు. పాఠశాలల్లో పిల్లలకు కూడా అవగాహన కల్పిస్తున్నారు.

కోరుకొండ పరిధిలో..

కోరుకొండ సీడీపీఓ పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలు ఉన్నాయి. ఇక్కడి 228 కేంద్రాల్లో సుమారు 10,474 మంది చిన్నారులున్నారు. వీరంతా 7 నెలల నుంచి ఐదేళ్ల లోపు వారే. అలాగే మూడు మండలాల్లో 1,137 మంది గర్భిణులు, 1,237 మంది బాలింతలున్నారు. వీరికి చిరుధాన్యాల ఉపయోగాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోషకాలు అధికం

రాగులు, జొన్నలు, కొర్రలు, గోధుమ తదితర చిరుధాన్యాలలో పోషక విలుకలు అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా మనకు సంపూర్ణ పోషణ లభిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా విటమిన్లు మనకు అందుతాయి. గర్భిణులు, బాలింతలు ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఈ శిబిరాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన అనేక రకాల పదార్థాలను అక్కడ ప్రదర్శిస్తున్నారు. శిబిరాలకు వచ్చే ప్రజలకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తోంది. అలాగే గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంది. – మద్దాల పెద్ద అమ్మాజీ, శ్రీరంగపట్నం సర్పంచ్

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ కిట్లు అందిస్తున్నాం. చిన్నారులకు బాలామృతం, గుడ్లు, పాలు, అలాగే గర్భిణులు, బాలింతలకు 3 కేజీల బియ్యం. కేజీ కంది పప్పు, అరలీటరు నూనె పంపిణీ చేస్తున్నాం. వీటిని ప్రతినెలా మొదటి, మూడవ శుక్రవారాల్లో అందిస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – ఝాన్సీరాణి, సీడీపీఓ, ఐసీడీఎస్ కోరుకొండ

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు



బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలులో మూడోరోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం టీడీపీ సానుభూతి పరులకు, లంచాలు ఇచ్చినవారికే దక్కేవని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరేళ్ల సుమలత, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, యామసాని రవి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- ఘనంగా ఎమ్మెల్యే రాజా పుట్టినరోజు వేడుకలు



కోరుకొండలో ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: ఆటో కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, వారి కోసం భవనం నిర్మిస్తానని ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. కోరుకొండలో గురువారం యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గణేష్ మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తన అన్నయ్యతో కుటుంబ సమేతంగా ప్రజలకు సేవలందిస్తామన్నారు. అనంతరం మండలంలోని ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు.

బీమా బాండ్లు పంపిణీ

బూరుగుపూడిలో వ్యవసాయ సలహామండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 కుటుంబాలకు ప్రమాద బీమా సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోనరావు ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. గ్రామంలో నృత్యం, డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలతో భారీ ప్రదర్శన చేశారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వ్యవసాయ సలహామండలి మండల చైర్మేన్ క్రొవ్విడి సత్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మహ్మద్ ఆరీఫ్, బొరుసు బద్రి, వాకా నరసింహరావు, ఇండిగమెల్లి సత్యనారాయణ, ఉల్లి సత్యప్రసాద్, అడబాల జగదీష్, పిట్టా కృష్ణ పాల్గొన్నారు.

కాటవరంలో..

మధురపూడి: సీతానగరం మండలం కాటవరంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థిని తాడేపల్లి కల్పనకు రూ.5 వేలు అందజేశారు. క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ కోనా వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, శ్రీకృష్ణపట్నంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, మాజీ కన్వీనర్ ఎం.వీర్రాజు, రాధేయపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, ముక్కినాడలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు అనదాస సాయిరామ్, తోకాడలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు జరిగాయి.



కాటవరంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న కరుటూరి శ్రీహరిబాబు, నాయకులు



బూరుగుపూడిలో బీమా బాండ్లు అందజేస్తున్న కంటే వినయ్‌తేజ, పార్టీ నాయకులు

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం



స్వచ్ఛతాక సంకల్ప్‌లో భాగంగా వీధులను శుభ్రం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రం పెంపొందించడం ద్వారా పల్లెలు ప్రగతి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. స్వచ్ఛతాక సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామవరంలో నిర్వహించిన కార్యక్రమానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛత రన్‌ను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, సచివాలయ కార్యదర్శులు పీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విజయమ్మకు వివాహ ఆహ్వానం

రాజానగరం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహనికి రావాలంటూ వైఎస్ విజయమ్మను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఆమెకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువు డీబీవీ రాజు లేఅవుట్‌లో అక్టోబర్ 26న జరిగే రిసెప్షన్‌కు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వైఎస్ విజయమ్మకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, రాజా



పేదలకు రక్షణగా ఆరోగ్య సురక్ష

రంగంపేట: పేదల ఆరోగ్య రక్షణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 522 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగి గంగరాజు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగ చైర్మన్ మంగిన రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, ఎంపీటీసీ ఎస్.సత్తిబాబు, పంచాయితీ కార్యదర్శి ఎస్.కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు కొండంత అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ రొంగల పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని కొంకుదురులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో 508 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. గురువారం జి.మామిడాడలోని సచివాలయం–4 వద్ద సర్పంచ్ లంక మున్ని అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో సుమారు 614 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి వెంకటపద్మావతి, సర్పంచ్ గుత్తుల పుష్పవతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

గోకవరం: గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. గోకవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. డాక్టర్లు శ్రీనివాస్, అబ్రహం, సునీల్, ఆలేఖ్య, నిఖిత, కుమార్, ధనుంజయరెడ్డి 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్, చింతల అనిల్ కుమార్, యేసు,రామ్ ప్రసాద్ నరసయ్య పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రవిచంద్ర, పుణ్యాకాంతి వైద్య సేవలందించారు. శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రజలందర్నీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దాల రమణ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, ఈఓపీఆర్డీ ప్రతాప్, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, ఎంపీటీసీ నూకరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సూరిశెట్టి కుటుంబరావు, కొయిడాల నానాజీ, శివాజీ, అప్పలస్వామి పాల్గొన్నారు.



కొంకుదురు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ రొంగల పద్మావతి

450 మందికి వైద్యపరీక్షలు

రాజానగరం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు అన్నారు. ఇందులో భాగంగా చక్రద్వారబంధంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ బి.రామారావు, తహసీల్దారు పవన్ కుమార్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ పర్యవేక్షణలో 450 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు నాగవరపు త్రిమూర్తులు, ఉప్పులూరి రమేష్, మార్గని శ్రీను, నాగవరపు రమణ, కొల్లేటి వెంకన్న, శివరామకృష్ణ పాల్గొన్నారు.



వెంకటాపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్



చక్రద్వారబంధంలో వైద్య శిబిరం



గోకవరంలో రోగులకు ఆరోగ్య కిట్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యువకుడికి సత్కారం



కొంకుదురులో సత్తి మణికంఠేశ్వరరెడ్డిని సత్కరించిన స్వాములు

బిక్కవోలు: సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) పరీక్ష ఫలితాల్లో ఆల్‌ఇండియా 28వ ర్యాంకు సాధించిన కొంకుదురు గ్రామానికి చెందిన సత్తి మణికంఠేశ్వరరెడ్డిని గురువారం సత్కరించారు. కొంకుదురు బుడితలమామిడి వద్ద అయ్యప్ప స్వామి ఆశ్రమంలో అయ్యప్ప మాలలో ఉన్న మణికంఠేశ్వరరెడ్డిని గురుస్వామి వెలగల చల్లారెడ్డి ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రుద్రారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కేవీవీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బిక్కవోలు: అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం పందలపాక పంచాయతీ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. పందలపాక ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. అనంతరం పంచాయతీ వద్ద గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో విద్యార్థుల ర్యాలీ



పెదపూడిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

పెదపూడి: పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్డీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య చర్యలు మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. సెప్టెంబర్ 27న ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి తెలిపారు.